

# కథా కౌముది

## వీలునామా

- స్వాతి శ్రీపాద

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో ఎంపికైన ఉత్తమ కథ)

**అర్ధరాత్రి! జీరో వాల్ట్** బల్బ్ గదిలో నీలి వెలుగు కళ్ళాపి జల్లుతోంది.

ఒక నిద్ర తెరలా పక్కకు జారాక మెళుకువ వచ్చింది లచ్చిన్నరసమ్మకు.

ఎదురుగా బల్లమీద చిన్నకూతురి పెద్దకొడుకు మంచి నిద్రలో రైలింజనులా గురకలు తీస్తున్నాడు.

ఇది వరలో అప్పుడో ఇప్పుడో ఇలా మెళుకువ వస్తే టీవీ ఆన్ చేసి అదో ఇదో చూసేది.

ప్చ్! ఇప్పుడా ఆశా లేదు. వినడానికి చెవులు అంత సునిశితంగా వినిపించడంలేదు. కళ్ళూ కాస్త మసక మసకగానే ఉన్నాయి.

అంతేనా..!? ఏం చూసిందో కాసేపయ్యాక గుర్తుండటం లేదు. అంతా అయోమయం. మనసు నిండా భయం భయం.

ఎంత మార్పులు చేర్పులు చేసినా, కొత్తగా ఆధునీకరించినా ఎప్పటి అనుబంధమీ గదితో! నిన్న మొన్నటిలానే ఉంది. అరవై ఏళ్ళ కిందట అప్పుడు పెద్దగా చదువులేవీ చెప్పించే కుటుంబం కాదు తమది. పెళ్ళప్పటికి తన వయసు సరిగ్గా పదిహేను. ముక్కుపచ్చలారకుండానే - మొగుడంటే ఏమిటో తెలీకముందే ముగ్గురు పిల్లల తల్లయిపోయింది.

తల విదిలించింది లచ్చి నరసమ్మ. కుడి బుగ్గమీద చురుక్కుమనేలా కాటు వేసింది దోమ.

ఠపామని కొట్టేసరికి దాని వెచ్చటి రక్తం జిగురు జిగురుగా చేతికంటుకుంది.

దోమలకూ దోమల మందు బాగా వంటబట్టినట్టుంది. అదో పక్కన వాసన పొగబండిలా చిమ్ముతున్నా వీటి దారి వీటిదే.

ఈ నడిరాతిరి ఏకాంతం శాపమా వరమా?

అర్ధంకాలేదు.

వయసెంత అనేది పెద్ద లెఖ్ఖగా తెలీదు గాని చాలా జీవితాన్నే చూసినట్టనిపిస్తోంది. అంతా ఇంతానా కొలుచుకుందుకు?

అనుభవానికి కొలమానం ఎక్కడుంది?

ఇంటినిండా బిలబిల్లాడుతూ పిల్లలు.

భగవంతుడిస్తున్నాడు అంటు సర్ది చెప్పుకోడం...

ఇప్పుడు ఇలా ఒంటరిగా ఆలోచించుకుంటే అది ఓ నిర్లక్ష్యం, నిర్లజ్జగా అనిపిస్తోంది. చిన్న ఆపరేషన్‌తో సరిపోయే వ్యవహారానికి ఎంత తప్పు చేసారు?

ఎన్నోసార్లు భర్తతో మొత్తుకుని చెప్పింది "ఆపరేషన్ చేయించుకోమని".

అప్పట్లో ఆడపడుచులు, అక్కచెల్లెళ్ళు ముగ్గురు నలుగుర్ని కనగానే ఆసుపత్రికెళ్ళి ఆపరేషన్ చేసుకుని రావడం చూస్తుంటే ఈర్ష్యగానూ అనిపించేది.

అతను ససేమిరా అంటూ ఒప్పుకుంటేగా....

"చిన్న సూది మందంటేనే భయం నాకు... ఆపరేషనా... నేనేగా సంపాయించి సంసారం నడిపేది, నిన్నేం మీ పుట్టింటినుంచి తెమ్మనట్లేదే"

అసలు భయం అదికాదని చాలా ఆలస్యంగా తెలిసింది, ఆ చిన్న ఆపరేషన్‌తో ఎక్కడ తన మగతనం కోల్పోతానోనన్న భయం... ఓ రకమైన అహం.....

"పోనీ నే చేయించుకోనా... మీ చెల్లెళ్ళు మా వాళ్ళంతా చెపుతున్నారు..." నసిగింది.

"ఒద్దొద్దు పిచ్చమ్మా! వాళ్ళకేం అలాగే చెపుతారు... నీకేమయినా అయితే నేనూ నా పిల్లలూ ఏం కావాలి? నే తట్టుకోలేను" అతని ప్రేమ మరోమాట అనకుండా కట్టిపడేసేది.

నిజానికి ఎంత ప్రేమగా చూసుకునేవాడు!

పిల్లలను కూడా లెక్కించకుండా తనకోసం ఇష్టమయిన తిండి పదార్థాలు క్రమం తప్పకుండా తెచ్చేవాడు కాదు!

ఎంత ఇబ్బందులున్నా కారప్పూస, చేగోడీలు, పకోడీ పొట్లమో ఏదో ఒకటీ రోజూ తేవలసిందే

పిల్లల్ని ఇంట్లో వదిలి ఎన్నిసార్లు తాము అర్థరాత్రి సినిమా చూసేందుకు వెళ్ళలేదు? ఒక్కోసారి దిగులు పడితే అతనే ఓదార్చేవాడు,

"ఇంతమంది పిల్లలు.. ఏకంగా పదిమంది.. వీళ్ళంతా ఎలా పెరగాలి? వీళ్ళ పెళ్ళిళ్లెలా..."

"ఎందుకమ్మా అంత చింత పడతావు? నాకు మంచి ఉద్యోగం ఉంది కదా... పెళ్ళిళ్ళెంత సేపు చూస్తుంటే అయిపోవూ.... పద బయటకు వెళ్ళివద్దాం... నీకు ఇంట్లో ఉండి ఉండి అన్నీ ఇలాంటి పిచ్చి ఆలోచనలే వస్తాయి..."

కష్టసుఖాల మధ్య రోజులు గిర్రున తిరిగిపోయాయి. ఐదుగురు అమ్మాయిల్లో ముగ్గురి పెళ్ళిళ్ళు చేసారు. ఇద్దరు కోడళ్ళు వచ్చారు.

ఏక చత్రాధిపత్యం క్రింద సాగిపోయే అధికారానికి అడ్డుకట్ట మొదలయింది. చదువుకున్న కోడళ్ళు తమమాటే నెగ్గించుకోవాలన్న పట్టింపులతో తగాదాలు మొదలయాయి.

"వాళ్ళిష్టం వచ్చినట్టుంటే మీదేం పోయిందంటూ" ఎదురు తిరిగిన కొడుకుల్ని చూసి అవాక్కయింది.

"ఊరుకో పిచ్చమ్మా, నువ్వు నిజంగా పిచ్చమ్మవే... అడ్డాల్లో బిడ్డలు గాని గడ్డాలొచ్చాక బిడ్డలా? ఇప్పుడు ఏమైనా అంటే వేరు పోతామంటారు..."

అనకముందే వేరు పోతామనడం మొదలయింది.

ఆ గొడవలు ఓ కొలిక్కి రాలేదు...

అనుకోని పిడుగుపాటు.

నిజమే పిడుగు పాటే....

ఇంటిపెద్ద హఠాత్తుగా కుప్పకాలి పోవడం పిడుగుపాటేగా!

జీవితం తల్లక్రిందులైపోయింది.

నిన్నటివరకు మహారాణిలా సాగిన దర్జా హఠాత్తుగా కూకటి వేళ్ళతో సహా పెకిలించుకు పోతుంది. అయినా దుఃఖాన్ని మనసు పొరల్లోనే అదిమి పెట్టుకుంది. ఇంకా పెళ్ళిళ్ళు కావలసిన పిల్లలున్నారు.

వాళ్ళ బాగోగులు చూడాలి.

తనిలా కృంగిపోతే వాళ్ళనెవరు ఓదారుస్తారనుకుని బాధను దిగమింగుకుంది. మసక మసగ్గా అగుపించే చూపు తడిగా మారింది. తనకు తెలియకుండానే ఊరిన కన్నీళ్ళను చీరకొంగుతో తుడుచుకుంది.

ఇంకా నా గుండెలో సౌకుమార్యం, కంటిలో కన్నీళ్ళు మిగిలి ఉన్నాయా?

ఆశ్చర్యమనిపించింది.

పెళ్ళిళ్ళయాక కూతుళ్ళకు మొగుళ్ళు కొడుకులకు పెళ్ళాలే ముఖ్యమనేది గ్రహించేందుకు ఎక్కువకాలం పట్టలేదు.

ఇహ అమ్మ అవసరం ఏముంది గనక?

అమ్మకు ఏం తెలుసు? అమ్మకు ఎందుకు చెప్పాలి?

నిజమే మాట మూగవోయింది.

ఉప్పెనలా దగ్గుతెర ఒకటి ఆమెను ముంచెత్తింది.

ఊపిరి ఆగిపోతుందేమోనన్నంత బాధ.

క్షణం గిలగిలలాడిపోయింది. అంతలోనే గుక్క తిప్పుకుని ఓపిక తెచ్చుకుని మంచం పక్కన స్టూల్ మీదున్న కూజాలో నీళ్ళు వంపుకుని ఓ గుక్క తాగింది. ఎవరో గొంతు నులుముతున్నట్టుగా బాధ.

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఎందుకో అమ్మ గుర్తుకు వచ్చింది.

అపురూపంగా చూసుకున్న తండ్రి గుర్తుకు వచ్చాడు.

పిల్లలందరిలోకీ అందంగా ఉంటుందనో లేదా పుట్టినప్పటినుండీ కలిసి వచ్చిందన్న సెంటిమెంటో గాని ఎంత అపురూపంగా చూసుకునేవారు!

పెళ్ళయాక కూడా తను కా అంటే కా, కీ అంటే కీగా సాగేది. చివరకు అక్కచెల్లెళ్ళు అన్నదమ్ముల భార్యలూ తనకు అమిత గౌరవమూ ఇచ్చేవాళ్ళు... అలాంటిది... ఇప్పుడు...

ఇలా...

కరుణించని చావు కోసరం రాత్రీ పగలూ ఎదురు తెన్నులు చూస్తూ....

మళ్ళీ మరోసారి దగ్గు... ఆగని దగ్గు.. ఊపిరి సలపనివ్వకుండా...

ఒక్క క్షణం.. భయంకరమైన అనుభవం...

అంతలోనే... ఏదో విముక్తి... బాధ తెలియని స్థితి.

ఒళ్ళంతా తేలికయిన అనుభూతి.

కళ్ళు తెరిచేసరికి కొత్త వాతావరణం...

సెంట్ స్ప్రే చేసినట్టు మందులు విరజిమ్మిన ఘాటైన వాసనలు.. ముక్కుపుటలను ఊదరగొడుతూ... బహుశా ఆ వాసనలకే స్పృహ వచ్చిందేమోననిపించింది లచ్చిన్నరసమ్మకు.

చుట్టుపక్కల గుసగుసలు వినబడుతున్నా కళ్ళు తెరవాలనిపించడం లేదు.

ఆసుపత్రి వాతావరణమని తెలుస్తూనే ఉంది.

ఇలా ఉన్న ఫలాన ఆసుపత్రికి వేసుకు రావలసి వచ్చినందుకు ఎంత తిట్టుకున్నారో....

ఎంత ప్రేమ వున్నా కొడుకులు మాత్రం ఏం చేస్తారు?

రోజూ వారీ వ్యవహారిక జీవనంలో ఇప్పుడు అవసరం ఉన్నది భార్య, తల్లికాదుగదా? అందుకే భార్య తాన అంటే వీళ్ళు తందాన అనాలి. లేకపోతే రోజుగడవడం కష్టం కదా?

అమ్మ అవసరం తీరిపోయింది, ఆస్తులూ ముట్టిపోయాయి. మరిక ఏమయితేనేం? మనసునిండా దిగులు, అయినా జీవితమంతా తోడుండవలసిన మనిషే ఇలా నడిసముద్రంలో ముంచి వెళ్ళిపోయాక ఎవరో ఏదో చేస్తారని ఎందుకు ఆశపడాలి? ఇహ ఏం మిగిలిందని బ్రతికుండాలని ఆశపడాలి?

"డాక్టర్ ఏమన్నారు?"

పెద్ద కోడలి స్వరం.

కళ్ళ చివరల్నించి కాస్త చూపు సారించిందామె.

"ఇవ్వాళ టెస్ట్లన్నీ చేస్తారట. అన్నీ సక్రమంగా ఉంటే ఆపరేషన్ చెయ్యాలి రెండు వాల్వులు చెడిపోయాయి అంటున్నారు. ఈ లోగా డబ్బులు సరిచూసుకోవాలి... ఎంతలేదన్నా కనీసం రెండు లక్షలన్నా ఉండాలి."

"మీ తమ్ముళ్ళేమన్నారు...?"

"ఇంకా మాట్లాడాలి. ఏదేమయినా ఇది వాయిదా వేసే సమస్య కాదుగా..." పెద్ద కొడుకు చెబుతున్నాడు.

మళ్ళీ నిద్రలోకి జారిపోయింది లచ్చిన్నరసమ్మ.

ఎక్కడెక్కడో విహరిస్తున్న అనుభూతి... ఎప్పటికో మెళుకువ...

మంచం పక్కన పెద్ద కోడలి కూతురు, పెద్ద మనుమరాలు బల్ల మీద కూర్చుని ఏదో పుస్తకం చదువుతోంది.

దాని పేరు లాక్షణి.

"అమ్ములూ" నూతిలోంచి వచ్చినట్టున్న ఆమె స్వరం వింటూనే లేచి వచ్చింది ఆ పిల్ల.

"నానమ్మా... ఎలాగుంది?"

"చాలా సుఖంగా ఉంది..."

"అమ్మా.. నాన్న.."

ఏ ముసలిదాన్ని చూసేందుకు పిల్లది చాల్లే అని ఇంటికి చెక్కేసారా? మనసులోనే కినుకగా అనుకుంది.

"ఇప్పుడే పని మీద వెళ్ళారు నానమ్మా.."

"ఏం పని? నాతో చెప్పొచ్చులే"

చెప్పాలా వద్దా అన్నట్టు కాస్త తటపటాయించి,

"ఆపరేషన్‌కు ఏర్పాట్లు చెయ్యాలిగా.." ఒక్కసారి ఉలిక్కిపడింది ఆమె. ముడతలు పడిన ఆ చర్మంలో ఏదో గగుర్పాటు.

"టెస్ట్ లన్నీ చేసారుగా.. అన్నీ బాగానే ఉన్నాయట... ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేసుకోమన్నారు డాక్టర్లు."

"దానికి మీ అమ్మ వెళ్ళడం ఎందుకే?" అనుమానంగా ప్రశ్నించిందామె.

"మరి బాంక్‌లో డిపాజిట్ అమ్మ పేర్నేకదా ఉంట?"

విషయం పూర్తిగా అర్థమయింది లచ్చిన్నరసమ్మకు.

బ్యాంక్‌లో డబ్బు కోడలికి పుట్టింటి నుండి అన్నదమ్ములు పంచిచ్చిన ఆస్తి.

ఆ డబ్బు అయిదారు లక్షలూ కూతురి పెళ్ళికని ఆ రోజే బ్యాంక్‌లో వేస్తూ పెళ్ళికి తప్ప ఎంత అవసరమొచ్చినా వాడొద్దని అనుకున్నారు.

ఇప్పుడది తీస్తున్నారంటే... మిగతా కొడుకులిద్దరు.. మొండి చెయ్యి చూపించి ఉంటారు.

లచ్చిన్నరసమ్మ చూపానని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ముందునుంచీ పెద్దాడు కాస్త మెతకే.

అమ్మ నాన్న అంటే అభిమానమే... అయినా...

ఆడపడుచు కూతుర్ని కానీ కట్నం లేకుండా చేసుకుందుకు ముందుకు రావడమేగా తనలో ద్వేషాన్ని పెంచింది.

అందులోనూ పెళ్ళయినప్పటి నుండి కాల్చుకుతిన్న ఆడపడుచామె.

ఓ పక్క తను చెపుతూనే ఉంది, చదువూ సంధ్యాలేని పిల్ల కాదు ఉద్యోగం ఉన్నదాన్ని చూస్తామని..

అప్పటికే అప్పుల్లో మునిగి తేలుతున్నారు వాళ్ళు.

ఇంతలో తగుదునమ్మా అంటూ ముందుకు వచ్చి

"అలాగంటే ఎలాగమ్మా? ఇప్పుడు ఈ పరిస్థితుల్లో అత్త మాత్రం ఎక్కడని చెయ్యగలదు. అత్తకు మాత్రం మనం తప్ప ఎవరున్నారు? మీకూ మీకూ ఏమయినా ఉండనీగాక. ఆ పిల్ల మీద ఎందుకు కోపం? నాకు అభ్యంతరం లేదు, కావాలంటే పెళ్ళయాక చదివించుకుంటాను"

అవాక్కయిపోయింది తను. ఇది ఎదురు చూడని దెబ్బ.

పెళ్ళి జరిగినా పిల్లలు పుట్టినా పెద్ద కొడుకుని మాత్రం క్షమించలేకపోయిందామె మనసు.

అందుకే అతన్ని దూరం పెట్టి చిన్నవాడికి పట్టం గట్టింది.

ఏరికోరి ఎంచుకున్న పిల్లతో అతని పెళ్ళి జరిపించింది. ఆ కోడలికి ఏడువారాల నగలూ చేయించింది.

పెద్ద కోడలికి పెళ్ళని ఒక్క చీరయినా కొనలేదు.

పాతికేళ్ళుగా మనసు నిండా ద్వేషం పెంచుకుంటూనే వస్తోంది.

ఇప్పుడు...

"మొన్న చూసెళ్ళిన పెళ్ళివాళ్ళు ఏమన్నారు?" మనవరాలిని ప్రశ్నించింది.

"ఏవో మాటలు సాగినట్టున్నాయి, కాని నాన్న ఇవ్వాళే చెప్పాడు... ఎమ్.సి.ఏ చదవమని... పెళ్ళికేం తొందర చదువయాక చూద్దామని.."

మాటల్లోనే వచ్చారు పెద్దకొడుకూ - కోడలు.

"అమ్మా ఎలా ఉంది? ఇదిగో... రేపే పాటికి ఆపరేషన్ చేస్తారు.. నెలకల్లా మామూలు మనిషివయిపోతావు." కొడుకు ధైర్యం చెప్పాడు.

"అవునండి. పెద్ద ఆపరేషన్ కూడా కాదు. రేపీపాటికి మామూలుగా ఉంటారు..." పెద్ద కోడలి ఓదార్పు.

లచ్చిన్నరసమ్మ మొహాన చెంపపెట్టులా తోచిందా ఓదార్పు.

పెళ్ళైన కొత్తలో అత్తా అత్తా అంటూ చుట్టూ చుట్టు తిరిగే కోడలికి ఓ రోజున చెప్పింది.

"కాస్త మర్యాదిచ్చి పిలవడం నేర్చుకో.. మీరనే అనాలి"

ఇప్పుడామె మనసు సిగ్గుతో కుంచించుకుపోయింది.

"పెద్దాడా... నీ ఒక్కడితో కాస్త మాట్లాడాలి"

అతను భార్యవంక కూతురి వంక చూసాడు.

ఇద్దరూ చేస్తున్న పని వదిలి బయటకు కదిలారు.

"ఆపరేషన్‌కు ఎంత ఖర్చవుతుంది?"

"ఎంతయినా కానీ..."

"అడిగినదానికి సరిగ్గా చెప్పు..."

"కావచ్చు ఓ రెండు లక్షలు.."

"నీ తమ్ముళ్ళకు చెప్పావా?..."

"చెప్పాను?"

"ఏమన్నారు?"

"ఇప్పుడవన్నీ ఎందుకమ్మా?"

"కాదు, అడిగినదానికి జవాబు చెప్పు"

"ఏవో ఇబ్బందులు.... పోనీలే... పిల్లలు గలవాళ్ళు.."

"నీకు లేవా ఇబ్బందులు.."

"....."

"కూతురి పెళ్ళికని ఉంచిన డబ్బు తీసావుగదూ?"

నిర్లిప్తంగా చూసాడు.

"ఇంకా కుదరలేదుగా, తొందరేం? మరో రెండేళ్ళు చదువుకుంటుంది" ఒక్కసారి అతని రెండు చేతుల్లో మొహం దాచుకుని పెద్ద పెట్టున ఏడ్పు మొదలుపెట్టిందామె.

"అమ్మా.... అమ్మా.. ఏమిటిది...?"

"పెద్దాడా... కడుపున పుట్టిన వాడవయినా సవతి తల్లి ప్రేమను చూపాను. నా మాట నెగ్గలేదన్న అహంతో మీపై విషం కుమ్మరించాను. ఎందుకురా ఇప్పుడిలా నా కోసం...."

అతని కళ్ళు చెమ్మగిలాయి. మాట పెగల్లేదు.

"నేనిప్పుడే మొహం పెట్టుకుని నీ భార్య మొహం చూడగలను?"

"అదేమిటమ్మా అలాగంటావు? ఏమీ తోచక నేను గింజుకుంటుంటే తనే చెప్పింది - ఇలా చేద్దామని. పెళ్ళి రెండేళ్ళు వాయిదా వేసినా ఇబ్బందేం లేదుగా?"

తెలతెలవారుతూనే ఓ నిశ్చయానికి వచ్చింది లచ్చిన్నరసమ్మ.

కొడుకు ఏ విధంగా చెప్పినా వినడు. అందుకే డాక్టర్‌గారితో సంప్రదించి మాజిస్ట్రేట్‌గారిని పిలిపించింది.

ఏవో ఆస్తులున్నాయేమో వీలునామా కావచ్చనుకున్నారంతా....

వ్రాత కోతలు పూర్తయాక నలుగుర్నీ లోపలకు పిలిచి ఆవిడ కోరికపై ఆ పత్రాన్ని చదివాడాయన.

"సంపూర్ణ ఆరోగ్యంతో నేను వ్రాయించిన పత్రమిది. దీన్ని ఎలా పిలుస్తారో మీ ఇష్టం. ఈ ఆపరేషన్ జరిగాక నేను ఎన్నాళ్ళు ఉంటానో డాక్టర్‌కే కాదు ఆ బ్రహ్మదేవుడికీ తెలీదు. కాని అందుకోసం కూతురి పెళ్ళి త్యాగం చేసి నాకొడుకూ కోడలూ కావలసినవి సమకూర్చినా ఆపరేషన్ విజయవంతమవుతుందో కాదో చెప్పలేని స్థితిలో నేనీ రిస్క్ తీసుకోదలుచుకోలేదు. ఉన్నన్నాళ్ళూ తృప్తిగా ఉండాలన్నదే నా ఆకాంక్ష.

నాకు ఇష్టం లేదు కనుక మెళుకవలో ఉన్నా స్పృహలో లేకున్నా నాకు ఎవరూ ఎలాంటి ఆపరేషన్లు చెయ్యరాదు.

**ఇట్లు,**

**లచ్చిన్నరసమ్మ.**

మానవత్వం మనిషి రూపు దాల్చినట్టు ఆమె పెదవులపై ఆరిపోని చిర్నవ్వు.